క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాపువాడ, అలంకార్ కూడలి, కాకతీయ కాలనీ, విజయ డైరీ, ఉజ్లీబేస్, ఘడీ మసీదు, జామా మసీదు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, సిటిజన్ క్లబ్, మెడికవర్ హాస్పిటల్, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, భద్రకాళి బండ్, విశాల్‌మార్ట్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఎల్‌బీనగర్, కెలికం కాలనీ, భారత్ గ్యాస్, నర్సంపేట రోడ్డు, మొయిన్‌పుర, తూర్పు కోట, మధ్య కోట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హంటర్ రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

న్యూశాయంపేట: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు బీజేపీ ప్రభుత్వం అప్పగించబోతుందని విమర్శించారు. సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలంలో పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రమేష్, ప్రభాకర్ రెడ్డి, చక్రపాణి, అశోక్, ఐలయ్య, సంపత్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మడికొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో సిరి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలపై గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ పొందటానికి సఖి సెంటర్ అండగా ఉటుందని చెప్పారు. ఆపద సమయంలో బాధిత మహిళలు, బాలికలు 181, 0870 2452112 నంబర్‌కు కాల్‌చేసి తక్షణ రక్షణ పొందవచ్చన్నారు. లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, సుధాకర్, కుమారస్వామి, లత పాల్గొన్నారు.

ఆర్‌జేడీఎంను కలిసిన పెన్షనర్లు



వరంగల్: వరంగల్ మార్కెటింగ్ ప్రాంతీయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన ఉప్పుల శ్రీనివాస్‌ను మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం బదిలీపై వరంగల్ డీడీఎంగా వచ్చిన పద్మావతి, డీఎంఓ అనురాధ, వరంగల్ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్–2 అంజిత్‌రావు, అకౌంటెంట్ సుకన్యను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సహాధ్యక్షుడు కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి సత్యనాథ్, కోశాధికారి అశోక్‌కుమార్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, దామోదర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జగన్మోహన్, సజ్జాద్‌అలీ, రాబిన్‌సన్, సాంబారెడ్డి, ప్రభాకర్, రాంచంద్రం, వీరన్న, స్వర్ణలత, జయమ్మ పాల్గొన్నారు.

డీడీఎంకు శుభాకాంక్షలు



వరంగల్: వరంగల్ మార్కెటింగ్ శాఖ డీడీఎంగా బాధ్యతలు చేపట్టిన పద్మావతిని మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నిర్మల, గ్రేడ్ –2 కార్యదర్శి రాము, బదిలీపై వెళ్తున్న జేడీఎం మల్లేషం, డీడీఎం రాజునాయక్, డీఎంఓ ప్రసాదరావు, యూనియన్ నాయకులు జన్ను భాస్కర్, కృష్ణ మీనన్, రాజేందర్, శ్రీనివాస్, లాషరీఫ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన పన్నుల అధికారి

వరంగల్ కార్పొరేషన్ పన్నుల అధికారిగా బాధ్యతలు చేపట్టిన బిర్రు శ్రీనివాస్ శుక్రవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేశారు.

వామ్మో.. వీధి కుక్కలు!

- బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్న గణేష్‌నగర్ ప్రజలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



గణేష్‌నగర్‌లో రాత్రివేళ సంచరిస్తున్న కుక్కలు



పగటి వేళ రోడ్డుపై..

ఖిలా వరంగల్: వరంగల్ 43వ గవిచర్ల క్రాస్‌రోడ్డు గణేష్‌నగర్‌లో వీధి కుక్కల బెడద అధికమైంది. బయటికి వెళ్లాలంటేనే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా కనిపిస్తున్నాయి. మాటువేసి మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. ఈక్రమంలో రాత్రి వేళల్లో వీధుల్లోకి రావడానికి జనం జంకుతున్నారు.

మాటు వేసి గాయపరుస్తున్నాయి

బల్దియా వీధికుక్కల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కుక్కల జనన నియంత్రణకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం ఆశించిన మేర ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. బాటసారులనే కాదు వాహనదారుల వెంటపడి దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కుక్కల దాడిలో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు నెలల క్రితం ఇద్దరిపై దాడిచేసి గాయపర్చాయి. ఓ మహిళ గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఓ వీధి కుక్క ఆమెపై దాడికి యత్నిస్తుండగా స్థానికులు వెళ్లి కాపాడారు. మూడు నెలల్లో కాలనీలో సుమారు 20 మందికిపైగా కుక్క కాటుకు గురైన బాధితులు ఉంటారని ప్రజలు తెలిపారు. రాత్రి సమయాల్లో వాటి అరుపులకు నిద్ర పట్టడంలేదని వాపోతున్నారు. అధికారులు చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

వీధికుక్కలను అరికట్టాలి



కాలనీలో వీధికుక్కల సంచారం ఎక్కువగా ఉంది. గుంపులుగా మాటువేసి దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. రాత్రివేళల్లో వాటి అరుపులతో నిద్ర పట్టడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలి.

– సోమయ్య, స్థానికుడు

మెట్టుగుట్టపై మాస శివరాత్రి పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ: మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, దేవేందర్‌శర్మ, సాయిశర్మ, శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బైరి రాజు, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు సురేష్, రాజేందర్, రవి, వెంకన్న, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు

ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ

హన్మకొండ: రైతులకు వెంటనే వ్యవసాయ సర్వీసులు మంజూరు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణ తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తూనే విద్యుత్ సర్వీస్ మంజూరులో కాలయాపన లేకుండా చూస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022, డిసెంబర్ 1నుంచి 2023, జులై 31 వరకు 910 సర్వీస్‌లు, 2023, డిసెంబర్ 1నుంచి 2024, జులై 31 వరకు 1171 సర్వీసులు మంజూరు చేసినట్లు వివరించారు. సర్వీసులను ఆన్‌లైన్ చేస్తునట్లు పేర్కొన్నారు. అలాగే ఈ –స్టోర్స్ విధానం ద్వారా రైతులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని, వంగిన స్తంభాలు, లూస్ లైన్‌లు కూడా సరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు చేపట్టినట్లు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మడికొండ: మడికొండ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మడికొండ గ్రామస్తులు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మసాగర్ నుంచి మడికొండ మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భారీ వాహనాలను ఔటర్ రింగు రోడ్డు ద్వారా పెద్దపెండ్యాల మీదుగా దారి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మడికొండ గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో పానగోటి వెంకట్‌రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్‌కుమార్, నర్ర నరేష్, ఎలగొండ శివ, మాచర్ల రంజిత్, చట్ల అజయ్, దుపెల్లి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మడికొండ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాస్టర్జీ విద్యాసంస్థల చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ సూచించారు. అలాగే, సమాజ సేవలో పాల్గొనాలని పేర్కొన్నారు. కాజీపేట మండలం మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా పాఠశాల హెడ్‌బాయ్‌గా రూపేష్, హెడ్ గర్ల్‌గా అక్షయ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలో కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఏఓ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు

వరంగల్ లీగల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన అనుకూల తీర్పు సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను మాదిగ న్యాయవాదుల సంఘం నాయకులు శుక్రవారం సుప్రీం కోర్టు ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కాజీపేట: పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి కాజీపేట చౌరస్తాలో బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, రాజ్‌కుమార్ యాదవ్, ఈసంపెల్లి కరుణాకర్, కోవెల జీవన్ ప్రకాష్, రేణుకుంట్ల కల్యాణ్ కుమార్, చాంద్‌పాషా, ఆకుల శ్రీకాంత్, గడ్డం మహేందర్, వెంకట్రావు పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద..

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద కాంట్రాక్టు, పార్ట్‌టైం, నాన్‌టీచింగ్ మాదిగ ఉద్యోగులు.. బీఆర్.అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, ఫ్యాకల్టీ క్లబ్ బాధ్యులు డాక్టర్ కనకయ్య, డాక్టర్ సత్యం, నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

మడికొండ చౌరస్తాలో..

మడికొండ: ప్రధాని మోదీ చిత్రపటానికి మడికొండ చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, ఎస్సీ మోర్చా 46వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం కిరణ్, బీజేపీ నాయకులు వెంకట్‌రావు, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, 45వ డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, అజయ్, రంజిత్, రాజ్‌కుమార్, నరేష్, అరవింద్, ధనుంజయ్, శివ, వెంకటేష్, శ్యామ్, కుమార్, పినోకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల లెక్క తేల్చండి

హసన్‌పర్తి: కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చాలని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనుమాండ్ల విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈనెల 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహించనున్న ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ హసన్‌పర్తి మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60శాతం ఉన్న బీసీలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను అవలంబిస్తున్నాయని విద్యాసాగర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుభాష్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, సాంబయ్య, రమేష్, దీకొండ భిక్షపతి, నేదునూరి కుమారస్వామి, అశోక్, తాళ్లపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సారంగపాణి

హన్మకొండ అర్బన్: లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ఎస్సీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర చంద్రమౌళి డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ అంబేడ్కర్‌నగర్, జితేందర్‌నగర్‌కు చెందిన లబ్ధిదారులు హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం మూడవ రోజుకు చేరింది. ఈ మేరకు దీక్ష శిబిరాన్ని వారు శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. 2012లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాజీవ్ ఆవాజ్ యోజన పథకం కింద పైలట్ ప్రాజెక్ట్‌గా అంబేద్కర్ నగర్, జితేందర్‌నగర్‌ను ఎంపిక చేసి అధికారులతో సర్వే చేయించి 576 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 జనవరిలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి 2019 జనవరిలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి పంపిణీ చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకోవాలని పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సారం రఘు, చదిగిరి రమేష్, గద్దపాటి లవకుమార్, రామంచ సతీష్, వంగాల రాజశేఖర్, సాయికుమార్, రాజు, రంజిత్, సుధాకర్, నితీష్, సుందర్, బాబు, పరమేశ్వర్, ప్రశాంత్, సైదులు, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఎం.రంజిత్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా పథకాల అమలులో సర్కారు విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి అర్షం అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు, నాయకులు మైదం పాణి, సాబిరికాని మోహన్, రమేష్, కిషోర్, సుధాకర్, మురళి, నరేష్, నాగరాజు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

హన్మకొండ: కులగణన చేసిన తర్వాత జనాభా దామాషా మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలని 57 ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీఎన్.స్వామి సూచించారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కులగణన చేయకుండా వర్గీకరణ చేస్తే అసంబద్ధంగా ఉంటుందన్నారు. జనాభా ప్రాతిపదికన, శాస్త్రీయ పద్ధతిలో ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన కులాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వర్గీకరణ చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఎంబీఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు త్రికోవెల భిక్షపతి, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సతీష్

హన్మకొండ చౌరస్తా: యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్ సూచించారు. హనుమకొండ ఇందిరానగర్‌లోని ఎస్ఎంహెచ్ వసతి గృహంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలోని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని అన్నారు. పట్టుదలతో చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు శ్రీదేవి, మోతీలాల్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్, తిరుపతి, ఉపాధ్యక్షుడు సుచందర్, సభ్యుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదలపై హర్షం



సంబురాలు జరుపుకుంటున్న జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: శాసన సభలో జాబ్ క్యాలెండర్ విడుదల ప్రకటనపై విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే 50వేల ఉద్యోగాల నియామకాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అభిరామ్, రమేష్, సురేష్, రమేష్‌చంద్ర, అశోక్, నవీన్, నాగరాజు, మొగిలి, రాజశేఖర్, రమ, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ట్రెజరీ డీడీకి శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకవరం శ్రీనివాసకుమార్‌ను టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శాకంబరీ అలంకరణలో శారద అమ్మవారు

రామన్నపేట: ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా వరంగల్ శ్రీనివాస కాలనీలోని శ్రీశృంగేరి శారదాపీఠంలో శారద అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చినట్లు ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు.

బోనమెత్తిన కూరగాయల వ్యాపారులు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్‌లోని వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో ఉన్న మైసమ్మ, ఎల్లమ్మ తల్లికి చిరు వ్యాపారులు శుక్రవారం బోనాలు సమర్పించారు. దేవతామూర్తులకు అర్చకులు పూజలు చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

ఖిలా వరంగల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని 40వ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా ఆధ్వర్యంలో ప్రజలకు పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు.

గాంధీనగర్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

హన్మకొండ: తమ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వరంగల్ నగరపాలక సంస్థ 57వ డివిజన్ హనుమకొండలోని గాంధీనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ నగర పాలక సంస్థలో మున్సిపల్ చీఫ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖిలా వరంగల్: గుంతలమయమైన రహదారులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వరంగల్ 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ కోరారు. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు.

పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

విద్యారణ్యపురి: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను హనుమకొండలోని ప్రభుత్వ పింగళి మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

హసన్‌పర్తి: చైతన్య కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కత్తుల డాక్టరేట్ అందుకున్నారు. చైతన్య డీమ్డ్ టూ బి యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ప్రతాప్ పర్యవేక్షణలో 'కన్స్యూమర్ బిహేవియర్ టువర్డ్స్ ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్– ఎ స్టడీ ఆఫ్ టూవీలర్స్' అనే అంశంపై చేసిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు వర్సిటీ డాక్టరేట్ అందజేసింది.

6న గద్దర్, జహీరొద్దీన్, అలీఖాన్ వర్ధంతి

ఖిలా వరంగల్: ఈనెల 6న వరంగల్ నర్సంపేట రోడ్డు క్రిస్టియన్ కాలనీ తెలంగాణ జంక్షన్ వద్ద గద్దర్, జహీరొద్దీన్, అలీఖాన్ వర్ధంతి యాదిసభను నిర్వహించనున్నట్లు మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు, కేదల ప్రసాద్, గద్దం శరత్, నలిగంటి పాల్ తెలిపారు.

వడ్డెర సొసైటీ అధ్యక్షుడిపై చర్య తీసుకోవాలి

మడికొండ: మెట్టు రామలింగేశ్వరస్వామి వడ్డెర స్టోన్ కట్టర్స్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటర్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిపై చర్య తీసుకోవాలని ఆరుగురు డైరెక్టర్లు కోరారు. ఈమేరకు డీసీఓ నాగేశ్వర్‌రావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపేట – పెండ్యాల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ శుక్రవారం తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మృతుడి వివరాలకు 87126 58609 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భర్త, అత్తామామ కనిపించడం లేదని ఫిర్యాదు

హసన్‌పర్తి: తన భర్త, అత్తామామ కనిపించడం లేదని ఓ వివాహిత పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన పారపాటి మణిదీప్‌కు నర్సంపేటకు చెందిన సాయి శివానితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఎస్‌బీఐ బ్యాంక్‌లో మణిదీప్ ఉద్యోగి. ప్రస్తుతం వారు హసన్‌పర్తిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. గత నెల 17న భర్త, అత్త గొడవ పడడంతో మర్నాడు శివాని తన తల్లిగారింటికి వెళ్లి 22న తిరిగి హసన్‌పర్తికి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

యువతి అదృశ్యం

రామన్నపేట: టిఫిన్ తీసుకువస్తానని ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువతి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ మట్టెవాడలోని రాజీవ్‌కాలనీ చెందిన తాటిపెల్లి శరత్‌కుమార్ కుమార్తె తాటిపెల్లి సంతోషిని (18) ఈనెల 1న ఉదయం 10 గంటలకు టిఫిన్ తీసుకువస్తామని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముగ్గురు యువకుల అరెస్ట్

హసన్‌పర్తి: గంజాయి కలిగిన ఉన్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కోమటిపల్లి టోల్ ప్లాజా ప్రాంతంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన పెండ్లి కృష్ణారెడ్డి, జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లికి చెందిన సాయి పవన్, నిజామాబాద్ జిల్లా వినాయకనగర్‌కు చెందిన అరవింద్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 80గ్రాముల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు.

కాజీపేట: డీజిల్ కాలనీలో గంజాయిని సేవించడంతో పాటు విక్రయిస్తున్న ఎండీ.అబ్దుల్ సత్తార్ (57)ను శుక్రవారం అరెస్ట్ చేసి, 60 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.